ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేది: 13.05.2026 సమయం: 13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని మిషన్ భగీరథ అధికారులను మంత్రి జూపల్లి కృష్ణారావు ఆదేశించారు.

2. కరీంనగర్‌లో హనుమాన్ జయంతిని పురస్కరించుకుని కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆధ్వర్యంలో "హిందూ ఏక్తా యాత్ర" ఘనంగా నిర్వహించారు.

3. బీఆర్ఎస్ సభ్యత్వ నమోదును శాస్త్రీయంగా చేపట్టేందుకు ప్రతి నియోజకవర్గానికి ప్రత్యేక సమన్వయకర్తలను నియమించాలని గులాబీ పార్టీ నేత కే చంద్రశేఖర్ రావు నిర్ణయించారు.

4. గోదావరి, కృష్ణా నదుల్లో రాష్ట్రానికి ఉన్న పూర్తి వాటాను వాడుకోవాలని TRS అధినేత్రి కల్వకుంట్ల కవిత ప్రభుత్వాన్ని కోరారు.

---------------------------------------

**జూపల్లి కృష్ణారావు**

వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని మిషన్ భగీరథ అధికారులను మంత్రి జూపల్లి కృష్ణారావు ఆదేశించారు. వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభితో కలిసి వివిధ మండలాల ఇంజనీరింగ్ అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. 2040 జనాభా అంచనాతో రూపొందించిన పథకం 2026 నాటికే ప్రజలకు పూర్తిస్థాయిలో

అందకపోవడంపై అధికారులను ప్రశ్నించారు. క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యలను పరిష్కరించాలని, ప్రజలకు ఇబ్బంది కలగకుండా చూడాలని సూచించారు. ఇదే క్రమంలో ఆర్ అండ్ బి శాఖకు మంజూరైన వివిధ పనుల పురోగతిని కూడా మంత్రి సమీక్షించి త్వరితగతిన పూర్తి చేయాలన్నారు.

**పీటీసీ – వనపర్తి**

----------------------------------

**ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం**

తెలంగాణలో ఎలక్ట్రిక్ వాహనాల వినియోగాన్ని ప్రోత్సహించేందుకు 2030 నాటికి 6,000, 2035 నాటికి 12,000 ఛార్జింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. రాష్ట్రంలో ప్రస్తుతం 2.8 లక్షలకు పైగా ఈవీలు ఉండగా, వీటి మార్కెట్ విలువ రూ.6,297 కోట్లకు చేరింది. ఈ వాహనాలకు రోడ్ టాక్స్, రిజిస్ట్రేషన్ ఫీజుల నుండి పూర్తి మినహాయింపు ఇస్తున్నట్లు ఇంధన శాఖ కార్యదర్శి నవీన్ మిట్టల్ తెలిపారు. హైదరాబాద్‌లో 2027 నాటికి 2,800 ఎలక్ట్రిక్ బస్సులను అందుబాటులోకి తెచ్చేలా ప్రణాళికలు సిద్ధమయ్యాయి. పీఎం ఈ-డ్రైవ్ పథకం కింద మరో 116 ప్రాంతాల్లో కొత్త ఛార్జింగ్ స్టేషన్ల ఏర్పాటుకు నిధులు మంజూరయ్యాయని ఆయన వివరించారు.

**డెస్క్**

-------------------------------

**వాకిటి శ్రీహరి**

కృష్ణా నదిపై 123 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మిస్తున్న వంతెన పనులను రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి నిన్న పరిశీలించారు. ఈ వంతెన నిర్మాణంతో ఆత్మకూరు ప్రాంతానికి మహర్దశ పడుతుందని, వచ్చే ఏడాది నాటికి దీనిని అందుబాటులోకి తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. వంతెన పూర్తయితే హైదరాబాద్ నుంచి మంత్రాలయం వరకు దూరం 60 కిలోమీటర్లు తగ్గుతుందని, రవాణా, వ్యాపార రంగాల్లో ఆత్మకూరు, గద్వాల్ ప్రాంతాలు

అభివృద్ధి చెందుతాయని వివరించారు. వర్షాకాలం లోపు పిల్లర్ల పనులు పూర్తి చేసి, నాణ్యతతో పనులు వేగవంతం చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు.

**పీటీసీ – మహబూబ్ నగర్**

-----------------------------------

**బండి సంజయ్**

హనుమాన్ జయంతిని పురస్కరించుకుని కరీంనగర్‌లో కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆధ్వర్యంలో "హిందూ ఏక్తా యాత్ర" ఘనంగా నిర్వహించారు. వైశ్యాభవన్ నుంచి ప్రారంభమైన ఈ యాత్రకు హంపి పీఠాధిపతి విద్యారణ్య భారతి ముఖ్య అతిథిగా హాజరుకాగా, వేలాదిగా తరలివచ్చిన భక్తులతో నగరం కాషాయమయమైంది. హిందువుల ఐక్యతను చాటిచెప్పేందుకే గత 16 ఏళ్లుగా ఈ యాత్రను నిర్వహిస్తున్నట్లు సంజయ్ పేర్కొన్నారు. జై శ్రీరామ్ నినాదం హిందూ ధర్మానికి రక్షణగా నిలుస్తుందని, సమాజానికి ఆపద కలిగితే ధైర్యంగా పోరాడుతామన్నారు.

**పీటీసీ – కరీంనగర్**

-----------------------------

**ఇంటర్ పరీక్షలు**

తెలంగాణ ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల్లో భాగంగా ఇవాళ మధ్యాహ్నం జరిగే ద్వితీయ సంవత్సర ద్వితీయ భాష పేపర్-2 పరీక్షకు అధికారులు 'సెట్-సి' ప్రశ్నపత్రాన్ని ఎంపిక చేశారు. రాష్ట్ర ఇంటర్ విద్యా మండలి కార్యదర్శి ఈ మేరకు ఒక ప్రకటన లో తెలిపారు. విద్యార్థులు ఎటువంటి ఇబ్బందులు పడకుండా అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

**డెస్క్**

------------------------

**దక్షిణాది రాష్ట్రాల ద్రవ్యోల్బణం**

ఏప్రిల్ నెల ద్రవ్యోల్బణ గణాంకాల్లో దక్షిణాది రాష్ట్రాలు దేశంలోనే మొదటి నాలుగు స్థానాల్లో నిలిచాయి. దేశవ్యాప్త సగటు 3.48 శాతంగా ఉండగా, తెలంగాణ 5.81 శాతంతో అగ్రస్థానంలోనూ, ఆంధ్రప్రదేశ్ 4.20 శాతంతో రెండో స్థానంలోనూ ఉన్నాయి. పట్టణ ప్రాంతాల కంటే గ్రామీణ ప్రాంతాల్లోనే ధరల పెరుగుదల ప్రభావం ఎక్కువగా కనిపిస్తోంది. జనవరి నుండి ద్రవ్యోల్బణం క్రమంగా పెరుగుతూ వస్తోందని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. టమోటా, ఆభరణాల ధరలు పెరగగా, ఉల్లి , పప్పుధాన్యాల ధరలు తగ్గుముఖం పట్టాయి.

డెస్క్

----------------------------------

**ఇంటర్మీడియట్ విద్యా మండలి**

తెలంగాణ ఇంటర్మీడియట్ విద్యా మండలి ఇంటర్ ప్రవేశాల సమయంలో మాదకద్రవ్యాల నిరోధానికి సంబంధించి విద్యార్థులు, తల్లిదండ్రులు నోటరీ చేసిన అఫిడవిట్లు సమర్పించాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది. కేవలం అవగాహన కోసం సాధారణ డిక్లరేషన్ ఫారం ఇస్తే సరిపోతుందని, దీని కోసం నోటరీల వద్దకు వెళ్లి అదనపు ఖర్చు చేయవద్దని సూచించింది. ఇప్పటికే ఈ మేరకు అన్ని కళాశాలల ప్రిన్సిపాళ్లకు ఆదేశాలు జారీ చేసినట్లు కార్యదర్శి తెలిపారు. డిక్లరేషన్ ఫారాలను బోర్డు అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచామని, ప్రవేశాల ప్రక్రియలో విద్యార్థులను ఇబ్బందులకు గురిచేయవద్దని కళాశాల యాజమాన్యాలను ఆదేశించారు. నిబంధనలను అతిక్రమించకుండా పకడ్బందీగా అమలు చేయాలని బోర్డు స్పష్టం చేసింది.

డెస్క్

------------------------------

**CCMB**

మొక్కలలో వైరస్ సంక్రమణను అడ్డుకునే కీలక రక్షణ వ్యవస్థను హైదరాబాద్‌లోని సీసీఎంబీ శాస్త్రవేత్తలు గుర్తించారు. డాక్టర్ మందార్ దేశ్‌ముఖ్ నేతృత్వంలోని బృందం నిర్వహించిన ఈ పరిశోధన ప్రకారం, మొక్కలు వైరస్ జన్యు పదార్థాన్ని బంధించడానికి ద్రవ రూపంలో ఉండే

జిగురు వంటి ప్రోటీన్ బిందువులను ఉపయోగిస్తాయి. ఈ ప్రోటీన్లలో ఉండే ప్రత్యేక విద్యుత్ ఆవేశాలు ఒకదానికొకటి ఆకర్షించుకుని దట్టమైన జెల్ వంటి పొరలను ఏర్పరుస్తాయి. ఇవి వైరల్ ఆర్ఎన్ఏను బంధించి, అది వృద్ధి చెందకుండా నిలువరిస్తాయి. ఈ ఆవిష్కరణ భవిష్యత్తులో మేలైన వంగడాల అభివృద్ధికి, మానవ వ్యాధుల చికిత్సకు దోహదపడనుంది.

డెస్క్

------------------------------------

**బీఆర్ఎస్ సమావేశం**

మాజీ ముఖ్యమంత్రి కే.చంద్రశేఖర్ రావు అధ్యక్షతన జరిగిన కీలక సమావేశంలో బీఆర్ఎస్ సభ్యత్వ నమోదు ప్రక్రియపై ప్రధాన నిర్ణయాలు తీసుకున్నారు. డిజిటల్ పద్ధతిలో నిర్వహించనున్న ఈ రెండో దశ సభ్యత్వ నమోదును శాస్త్రీయంగా చేపట్టాలని, ప్రతి నియోజకవర్గానికి ప్రత్యేక సమన్వయకర్తలను నియమించాలని నిర్ణయించారు. ఈ ప్రక్రియలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సుమారు 35 వేల పోలింగ్ కేంద్రాల్లో ఇద్దరు చొప్పున డిజిటల్ సహాయకులను నియమించి, వారికి ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నారు. ఓటర్ల జాబితా సవరణతో సమన్వయం చేసుకుంటూ, పార్టీ సభ్యత్వ వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేసేలా పక్కా ప్రణాళికను సిద్ధం చేశారు. నియోజకవర్గాల వారీగా పార్టీ యంత్రాంగాన్ని ఈ ప్రక్రియలో భాగస్వాములను చేస్తూ సభ్యత్వ నమోదును విజయవంతం చేయాలని కేసీఆర్ పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు.

డెస్క్

----------------------------------

**సిరిసిల్ల ప్రమాదాలు**

వేసవి తీవ్రత వల్ల అగ్ని ప్రమాదాలు పెరిగే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రాజన్న సిరిసిల్ల జిల్లా ఫైర్ ఆఫీసర్ నరేందర్ సూచించారు. ఆకాశవాణి ప్రతినిధి రాచర్ల లక్ష్మీనారాయణతో మాట్లాడిన ఆయన, ప్రమాదం సంభవించినప్పుడు ఆస్తి నష్టం కంటే

ప్రాణ రక్షణకే మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు. మంటల బారి నుండి ప్రాణాలను కాపాడుకోవడం అత్యంత ముఖ్యమన్నారు

**Byte: సిరిసిల్ల జిల్లా ఫైర్ ఆఫీసర్ నరేందర్**

**పీటీసీ – రాజన్న సిరిసిల్ల**

---------------------------

**కల్వకుంట్ల కవిత**

రాష్ట్ర ప్రభుత్వం నీటి ప్రాజెక్టుల పూర్తికి అత్యంత ప్రాధాన్యతనిచ్చి నిధులు విడుదల చేయాలని TRS అధినేత్రి కల్వకుంట్ల కవిత కోరారు. పొరుగున ఉన్న ఆంధ్రప్రదేశ్ ప్రాజెక్టుల విషయంలో ప్రత్యామ్నాయాలు ఆలోచిస్తుంటే, తెలంగాణ ప్రభుత్వం ఎందుకు విఫలమవుతోందని ఆమె ప్రశ్నించారు. గత ప్రభుత్వం భారీగా నిధులు ఖర్చు చేసిందని, ప్రస్తుత ప్రభుత్వం కూడా వేల కోట్లు కేటాయిస్తామని చెబుతున్నప్పటికీ, కృష్ణా, గోదావరి నదుల్లో మన రాష్ట్రానికి ఉన్న పూర్తి వాటాను వినియోగించుకోలేకపోతున్నామని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.

**డెస్క్**

-----------------------------

**ఆది శ్రీనివాస్**

నీట్ పేపర్ లీకేజీపై విప్ ఆది శ్రీనివాస్ ముస్తాబాద్‌లో ఆగ్రహం వ్యక్తం చేశారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనూ పేపర్ లీకేజీలు జరిగాయని విమర్శిస్తూ, రేవంత్ రెడ్డి నాయత్వంలో రాష్ట్రంలో 70 వేల ఉద్యోగ నియామకాలు ఒక్క లీకేజీ లేకుండా పారదర్శకంగా జరిగాయని పేర్కొన్నారు.

**పీటీసీ – రాజన్న సిరిసిల్ల**

-------------------------

**రాజన్న సిరిసిల్ల - గురుకుల కళాశాల**

రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం ఇందిరమ్మ కాలనీలోని గిరిజన సంక్షేమ గురుకుల బాలికల జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సర ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతున్నట్లు రీజినల్ కోఆర్డినేటర్ వెంకన్న తెలిపారు. ఎంపీసీ, బైపీసీ, ఏటీ వొకేషనల్ గ్రూపుల్లో నేరుగా అడ్మిషన్ల ప్రక్రియ ఈనెల 18న ఉదయం 10 గంటలకు ప్రారంభం కానుంది.

**పీటీసీ – రాజన్న సిరిసిల్ల**

-------------------------------

**రాజన్న సిరిసిల్ల - ఎన్పీడీసీఎల్**

రాజన్న సిరిసిల్ల జిల్లాలో నాణ్యమైన విద్యుత్ సరఫరా కోసం ఎన్పీడీసీఎల్ ఎస్ఈ వేణుమాధవ్ కీలక చర్యలు చేపట్టారు. జిల్లాలోని 26 గ్రామాల్లో సింగిల్ ఫేజ్ ఏబీ స్విచ్‌లను ఏర్పాటు చేయడం ద్వారా, ఎక్కడైనా సాంకేతిక లోపం తలెత్తితే లైన్ మొత్తం నిలిపివేయకుండా కేవలం సంబంధిత ట్రాన్స్‌ఫార్మర్ వద్దే సమస్యను పరిష్కరించే వీలుంటుందని ఆయన తెలిపారు. దీనివల్ల విద్యుత్ అంతరాయాలు త్వరగా గుర్తించడంతో పాటు సిబ్బంది భద్రత కూడా పెరుగుతుందని పేర్కొన్నారు. వినియోగదారులు అత్యవసర విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం 1912 టోల్ ఫ్రీ నంబర్‌ను సంప్రదించాలని ఆయన సూచించారు.

**పీటీసీ – రాజన్న సిరిసిల్ల**

-------------------------------

**మంచిర్యాల**

అకాల వర్షాల నేపథ్యంలో కొనుగోలు చేసిన ధాన్యం దెబ్బతినకుండా గోదాములలో భద్రపరుస్తున్నట్లు మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. చెన్నూరు మార్కెట్ యార్డు గోదామును అధికారులతో కలిసి సందర్శించిన ఆయన, ధాన్యాన్ని త్వరితగతిన రైస్ మిల్లులకు తరలించాలని ఆదేశించారు.

**పీటీసీ - మంచిర్యాల**

----------------------------------------

**ఆసిఫాబాద్**

ఆసిఫాబాద్ జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతూ పదో తరగతి ఫెయిల్ అయిన విద్యార్థుల కోసం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాధికారిని లలిత తెలిపారు. జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో జూన్ 3వ తారీకు వరకు నిర్వహించ తలపెట్టిన ప్రత్యేక తరగతులను ప్రారంభించారు.

**పీటీసీ – ఆసిఫాబాద్**

----------------------------------

**నల్లగొండ**

నల్లగొండ జిల్లాలో ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయని జిల్లా విద్యాధికారి దశ్రు నాయక్ తెలిపారు. మొత్తం 29 కేంద్రాలలో మొదటి సంవత్సరం నుంచి 6 వేల 046 మంది, రెండో సంవత్సరం నుంచి 4 వేల 032 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని, నిబంధనల ప్రకారం పరీక్షా కేంద్రాల వద్ద బీఎన్ఎస్ 163 సెక్షన్ అమలులో ఉంటుందని ఆయన వెల్లడించారు.

**పీటీసీ - నల్గొండ**

--------------------------------